అడల్ట్స్ ఓన్లీ కథ



# పందెం!

డా. పేరాల శ్రవణ్ కుమార్

''ఒక స్వీట్ న్యూస్ చెప్తే ఏమిస్తావోయ్!'' వంటింట్లో కొచ్చి కూరలు తరుగుతున్న జానకమ్మని కొంటెగా అడిగాడు గోపాలరావు.

''అబ్బ! చంపక విషయం చెబుదురూ'' భర్తను విసుక్కుందామె.

''పండక్కి మన శశిధర్ లండన్ నించి వస్తున్నాట్ట. ఓ రెండు వారాలు ఉంటాట్ట. రేపే వస్తున్నాడు!'' సంబరంగా అన్నాడు.


''నిజంగానా. ఎంత మంచివార్త. రేపు వాడికిష్టమైన బూరెలు, పులిహోర, సున్నుండలు అన్నీ చేసి పెట్టాలి. అయినా నాకు తెలీకడుగుతాను. నాలుగేళ్ళ కాంట్రాక్టు అయిపోతుందని ఇక మనదేశం వచ్చేస్తాడన్నారు కదండీ ఆ మధ్య! మళ్ళీ రెండు వారాలకి రావడమేంటి? అవతల మా తమ్ముడు ఆరాటపడిపోతుంటే. అంకితకా పెళ్ళి వయసు దాటుతోంది. వాళ్ళ తొందర వాళ్ళకుండదూ. చిన్నప్పటినుంచీ అనుకున్న సంబంధం అని కాచుకు కూర్చున్నారు. వీడేమో తాత్సారం చేస్తున్నాడు'' కళ్ళు తుడుచుకుంటోంది జానకమ్మ.

''అదేంటోయ్! వాడొచ్చాక అన్నీ వివరంగా అడుగుదాం. రెండేళ్ళు కాంట్రాక్టు అని వెళ్ళేడు లండన్‌కి. అదే మరో రెండేళ్ళు పొడిగించేరనీ, మంచి జాబ్ అనీ ఉండిపోయేడు. ఈసారి మళ్ళీ వెళ్ళొద్దని నచ్చజెప్పి పెళ్ళికానిచ్చేద్దాంలే. వాడికి మాత్రం వయసు మీరట్లేదూ!'' భార్యని అనునయించాడు.

ఊరడించిన మనసుతో కొడుక్కి ఇష్టమైన పిండివంటలు చేసే పనిలో పడింది జానకమ్మ. ఆమెకి పరమానందంగా ఉంది కొడుకు వస్తాడని. భర్త, పిల్లలతోటితే లోకం ఆమెకి.

★ ★ ★

గోపాలరావు టీచరుగా ఆ ఊరొచ్చిన నాటి నుండి రిటైరయేనాటి వరకు ఆ ఊరు వదలలేదు. నిమ్మకు



నీరెత్తినట్టు నిర్మలంగా ఉండే ఆ ఊరంటేనే గోపాల్రావుకే కాదు పిల్లలిద్దరికీ కూడా ఎంతో ఇష్టం. కూతురు మధురకి కొడుకు శశిధర్‌కీ క్షణం పడేది కాదు చిన్నప్పుడు. పందేలు వేసుకుంటూ, గిల్లికజ్జాలు పెట్టుకుంటూ ఆడుతూ పాడుతూ ఉన్నా చదువుల్లో ఇద్దరూ చురుకే. మధురకి డిగ్రీ అయిపోగానే మంచి సంబంధం కుదరడంతో పెళ్ళి చేసేశాడు గోపాల్రావు. అల్లుడు భాస్కర్ భోపాల్‌లో బ్యాంక్ మేనేజర్. నెమ్మదస్తుడు. వాళ్ళకి ముద్దులు మూటకట్టే ఒక కొడుకు కూడా.

శశిధర్ అల్లరిలోనూ చదువులోనూ ఫస్టే. ఇంటర్లో మంచి ర్యాంక్ వచ్చి, అనుకున్నట్టే కాన్పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు వచ్చింది.

''ఈ ఊరు వదిలి ఎలా వెళ్ళను నాన్నా! ఈ రామాలయం, ఈ పచ్చటి పైరగాలి, మీ ఆప్యాయత, అమ్మ వంట..''

''అమ్మ వంట మాత్రం నచ్చిందా!'' చెవి మెలిపెట్టింది అమ్మ సరదాగా.

''శశీ! నువ్వు గొప్ప ఇంజనీరువై ఈ ఊరికి పేరు తేవాలి. ఇక్కడే ఉండిపోతే అది సాధ్యం కాదు కదా!'' అంటూ నచ్చజెప్పి వాణ్ణి కాన్పూర్ పంపేసరికి తలప్రాణం తోకకొచ్చింది తనకి. నాలుగేళ్ళూ నాలుగు నిమిషాల్లా గడిచిపోయాయి. మెరిట్ స్టూడెంట్ కావడంతో కాంపస్ సెలక్షన్‌లో బెంగుళూర్‌లో జాబ్ కూడా వెంటనే వచ్చింది. బెంగుళూర్లో ఉండగానే ఫారిన్ ఎసైన్‌మెంట్ అంటూ నాలుగేళ్ళ క్రితం వెళ్ళిన వాడు ఇన్నాళ్ళకి మళ్ళీ ఈ ఊరు రావడం.

పక్క వీధిలో జానకమ్మగారి తమ్ముడింట్లో సందడిగా ఉంది. ''శశి రేపే వస్తున్నాట్ట. ఈసారి ఎలాగైనా మూడుముళ్ళు వేయించెయ్యాలి. లేకపోతే మళ్ళీ ఏ అమెరికానో తుర్రుమంటాడు వీడు!'' భార్యాభర్తల కబుర్లు చాటుగా విని ముసిముసిగా నవ్వుకుంది అంకిత.

'బావని ఈసారి వదలకూడదు. అర్జెంటుగా పెళ్ళి చేసేస్కోవాలి!' తనలో తనే ఎర్రబడ్డ చెక్కిళ్ళతో నవ్వుకుంది సిగ్గుగా.

చిన్నప్పుడు బావతో ఆటలు బాగానే ఆడేది తను. పెద్దమనిషయ్యాక పెద్దవాళ్ళ కట్టడి వల్ల ఆటలు క్రమంగా మానేసినా, బావ వీలు చూసుకుని సీక్రెట్ మీటింగులు పెట్టేవాడు. ఇంజనీరింగ్ చదివేటప్పుడు వేసవి సెలవుల్లో వచ్చినప్పుడు, ఎవరికీ తెలియకుండా మామిడి తోటలో కలుసుకున్నప్పుడు తొలి ముద్దు మాధుర్యం రుచి చూపించాడు. హద్దు మీరని ముద్దు ముచ్చట్లు బాగానే తీర్చుకునేవాడు కొసరి కొసరి మా కొంటె బావ.. ఉద్యోగంలో చేరగానే చేసుకుంటాడనుకుంటే కెరీర్ కెరీర్ అంటూ లండన్ తుర్రుమన్నాడు. ఈసారి తను వదల్లు బావని. సిగ్గుగా నవ్వుకుంది అంకిత.

★ ★ ★

ఆరోజు రానే వచ్చింది.

గోపాల్రావు టాక్సీ తీసుకుని ఎయిర్‌పోర్టుకి వెళ్ళాడు. కొడుకుని చూడగానే కోటి రూపాయల లాటరీ తగిలినట్టు వెలిగిపోయింది గోపాల్రావు ముఖం. ఆ ఠీవి, దర్పం అంతా తన చిన్నప్పటి పోలికే.

''ఓహ్ డాడ్! ఈ గతుకుల రోడ్లూ, గుడిసెలు, అతుకుల బతుకులు, ఈ పూర్ ఇండియా ఎన్నాళ్ళైనా మారదా!'' అవి శశిధర్ తొలి పలుకులు.

ఇండియాని తూలనాడితే గోపాలరావు గుండె కలుక్కుమంటుంది. చిన్నప్పుడు స్వాతంత్ర్యోద్యమంలో జైలుకెళ్ళిన వాడతను.

''అబ్బా! రోడ్డంతా కుదుపులు మమ్మీ! చచ్చాననుకో! ఈ దిష్టి తతంగాలూ, నువ్వూ మారవా మమ్మీ!'' ఇంటికి రాగానే ప్రేమగా దిష్టి తీస్తున్న తల్లిని ముద్దుగా విసుక్కున్నాడు శశి.

''అది తల్లి ప్రేమంటార్లేగానీ! ఈ మమ్మీ డాడీ పిలుపులేంట్రా. ఇదివరకూ అమ్మా, నాన్నా అని పిల్చేవాడివిగా హాయిగా'' జానకమ్మ నవ్వుతూ చురక వేసింది.

లండన్ స్టైల్‌లో భుజాలెగరేసి ఊరుకున్నాడు శశి.

భోజనాల వేళ. ''అబ్బ.. ఈ బూరెలు, సున్నుండలూ, పికిల్సూ, ఆయిలీస్టఫ్, ఇదంతా మర్చిపోయి యుగాలైంది మమ్మీ. అక్కడ బ్రెడ్ శాండ్విచ్, జామ్, ఛీజ్ అలవాటైపోయాయి. రేపట్నించి కష్టపడి ఇవన్నీ చెయ్యకు. ఈరోజుకేదో కష్టపడి తింటాన్లే'' అంటూంటే చిన్నబోయింది జానకమ్మ ముఖం.

''అలా ఊరు చూసొద్దాం రారా!'' అని కొడుకుని తీసుకొని ఊళ్ళోకెళ్ళాడు గోపాలరావు. తెలిసిన వాళ్ళు పలకరిస్తుంటే ఇబ్బందిగా ముక్తసరిగా జవాబిస్తున్నాడు శశి. స్కూలుకి తీసుకెళ్ళాడు గోపాలరావు.

''ఒరే! నేను పనిచేసిన స్కూలు. నువ్వు చదివిన స్కూలు. ఆ జ్ఞాపకాలు భలే ఉంటాయి కదూ!'' స్కూల్లో అడుగుపెడ్తూ అన్నాడు గోపాల్రావు.

''ప్చ్. ఏం మారలేదు. ఆ గోడలకి బీటలు, ఓల్డ్ ఫర్నిచర్, ఓహ్- ఓసారి లండన్‌లో స్కూల్స్

## త్యాగం చేయాల్సిందే!

**రో**జురోజుకీ సినిమాలు తగ్గిపోతున్న తరుణంలో తారలు తమ రెమ్యూనరేషన్‌ని తగ్గించుకోవాలని అంతా అంటున్నారు. ఇదిలా ఉంటే పోటీ పెరుగుతుండడం వల్ల తారలు కొన్ని సీన్స్‌లో నటించడానికి, వెరైటీ పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉండాలంటోంది బెంగాలీ రసగుల్లా బిపాషాబసు. 'అవును. ఈరోజుల్లో సినిమా ఛాన్స్‌లు చాలా తక్కువగా వస్తున్నాయి. టీవీ ప్రభావం బాగా పెరిగిపోయింది. అందుకే కొన్ని సీన్స్ విషయంలో కొన్ని త్యాగాలు తప్పని సరి' అంటోంది.



చూపించాలి మనవాళ్ళకి. సిగ్గుతో చస్తారు'' అంటూ గోడమీద రాసున్నది చదివి పలగబడి నవ్వుతున్నాడు శశి.

''ఏ దేశ మేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని. అదేంటి డాడీ! వేరే దేశం వెళ్ళి మన దేశాన్ని పొగిడితే వాళ్ళూరుకుంటారా!'' నవ్వుతూ వెకిలిగా కామెంట్ చేస్తుంటే గోపా(లావుకి కోపం నషాళానికంటింది.

''దాని అర్థం ఎక్కడ ఉన్నా నీ మనసులో నీ దేశ ఔన్నత్యాన్ని మరచిపోకు అనిరా! చిన్నప్పుడు నేర్చుకున్న పాఠాలు మర్చిపోయినట్టున్నావు!'' నవ్వుతూనే చురక వేశాడు.

మరోసారి ష్రగ్ చేసి యధాలాపంగా అక్కడి టీచర్‌ని విష్ చేసి బైటికొచ్చాడు శశి.

సాయంత్రం రామాలయానికి వెళ్ళారు తండ్రీ కొడుకూ.

''ఏమిటో డాడ్! ఆ బడి, ఈ గుడి, మన ఇంట్లో పాత గొంగళి ఎక్కడ వేస్తే అక్కడ అలానే ఉన్నట్టున్నాయ్. నో డెవలప్‌మెంట్'' అంటూ ఇండియాలో పెరిగిపోతున్న పావర్టీ, కరప్షన్ గురించి చిన్న లెక్చరిచ్చారు. పకరించబోయిన పూజారిగార్ని 'హాయ్' అనడంతో ఖంగుతిని ఆయన మారు మాట్లాడలేదు.

''నీ చిన్నప్పుడు ఈ గుళ్ళో ఆడుకునేవాడివి. పూజారిగారు రోజూ ప్రసాదం పెట్టేవారు ఎంతో ప్రేమగా. గుర్తు లేవుట్రా ఆ రోజులు'' అనుమానంగా నిలదీశాడు గోపాలరావు. కొడుకు విదేశీ పోకడలు నచ్చడం లేదు ఆయనకి.

మళ్ళీ లండన్ స్టయిల్‌లో భుజాలెగరేశాడు శశిధర్.

చిన్నప్పటి నుంచి అనుకున్న సంబంధమే కనక ఇక ఆలస్యం చెయ్యకుండా వచ్చి పెళ్ళి మాటలు మాట్లాడుకోమని ముహూర్తాలు ఖాయం చేద్దామని పిలిచాడు గోపాలరావు బావమరిది. తప్పదన్నట్టు తల్లీతండ్రితో మామయ్య ఇంటికి వెళ్ళాడు శశిధర్. పెద్దవాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారు. పట్టు చీరలో మెరిసిపోతూ నునుసిగ్గుతో వచ్చిన మామకూతుర్ని చూసి 'ఓహ్ నాటు కోడి పెట్టలా ఉంది!' మనసులో అనుకుని పైకి మాత్రం ''వావ్! ఎంత మరిపోయావ్ అంకితా'' అన్నాడు. సిగ్గు దొంతర్ల మధ్య నవ్వుతూ కాఫీ అందించింది.

''కమాన్! అలా గార్డెన్‌లోకి వెళ్దాం'' అని దారి తీశాడు శశి.

గులాబీల మధ్య గులాబీల రాణిలా ఉంది అంకిత. ఒక్క ఉదుటున ఓ చెట్టు మాటున నడుం చుట్టూ చేతులు పెనవేసి రెండు బుగ్గల మీదా మధురంగా చుంబించాడు.


''బావా ఏమిటీ పనులు సిగ్గులేకుండా! ఇంతకీ ఏమిటీ పెళ్ళంటే తప్పించుకు తిరుగుతున్నావట. ఎప్పుడు చేసుకుంటావ్. ముసలాడివయ్యాకనా!'' చనువుగా చిరుకోపంగా అడిగింది.

''ఏదీ పిల్ల దొరకందే!'' అల్లరిగా అన్నాడు శశి.

''బావా జోకులెయ్యకు. ఒళ్ళు మండితే వేరే సంబంధం చూసుకుంటా!'' నవ్వుతూ చురకంటించింది.

''ఓహ్ గాడ్. నిజంగానే అంకితా. లండన్‌లో ఇలా ముద్దుల్తోనే పలకరించుకుంటారు. అంతే! పలకరించగానే పెళ్ళి మూడ్‌లోకి వెళ్ళిపోతే ఎలా? పెళ్ళిచూపులకి కాదు నేనొచ్చింది మామకూతురుని కదా పలకరించి పోదామని వచ్చా'' అంటూ హడావిడిగా ''డాడ్!'' అనుకుంటూ హాల్లోకి వెళ్ళాడు.

''ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందాం అంటున్నాడ్రా మామయ్య!'' కొడుకు వేపు గోముగా చూస్తూ అంటున్న జానకమ్మని విసుగ్గా చూస్తూ-



''మమ్మీ! ప్లీజ్. అవన్నీ ఇంట్లో మాట్లాడదాం. కమాన్'' అంటూ బయలుదేరుతున్న బావని చూస్తే ఏదో అనుమానం, భయం కలిగాయి అంకితకి. బావ తనని కాదనడు గదా!

''ఇంతకీ ఏమిట్రా నీ నసుగుడు. అంకితని చేస్కునే వెళ్ళచ్చుగా ఆ లండనేదో!'' చిరాగ్గా అన్నాడు గోపా(లావు ఇంటికి వచ్చాక.

స్టైల్‌గా నవ్వాడు శశి- ''ఓహ్ గాడ్! ఆ పల్లెటూరి మొద్దులో ఏదేనా మార్పు వచ్చిందేమో లండన్ లైఫ్‌కి సూటవుతుందేమో చూద్దామని వచ్చాను మీతో. మై గుడ్‌నెస్. ఇంకా అలాగే..ఆ జడ తిప్పుకోడాలూ, ఆ మూతి విరుపులు, సిగ్గులు..ఐ కాంట్ ఇమాజిన్ హర్ టు బి మై వైఫ్! మోస్ట్‌లీ డాడ్..నేను లండన్‌లోనే సెటిలవొచ్చు. అక్కడే ఎవరేనా ఆ వాతావరణంలో పెరిగిన గర్ల్, అదే...ఇండియన్ గర్ల్‌నే చేసుకోవడం బెటర్ అనుకుంటాను డాడ్. మీరే అర్థం చేసుకోగలరు నా

## అభిరుచి

**శిల్పా షెట్టి ఎప్పుడూ వెరైటీగా నిర్మించే సినిమాల్లో నటించాలనుకుంటుంది. ఆమె అభిరుచికి తగ్గట్టే సినిమాలు కూడా ఉంటాయి. 'అసలు సినిమాని ఎంపిక చేసుకునేముందు ఏమాలోచిస్తావు?' అని అడిగితే 'క్వాలిటీ గురించి ఆలోచిస్తాను' అని చెబుతోంది. 'ఏడాదికి ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు. ఎలాంటి సినిమాలో నటించామన్నది ముఖ్యం. ఇప్పుడు నా చేతిలో రెండు మూడు సినిమాలు ఉన్నాయి. వాటి గురించే ఆలోచిస్తున్నాను' అంటోంది శిల్పా.**

ప్రాబ్లమ్. మమ్మీని మీరే కన్విన్స్ చెయ్యండి'' అంటూ డాబా పైకి వెళ్ళిపోయాడు.

మ్లానమైన ముఖంలో కోపం బుసకొట్టింది గోపాల్రావులో. జానకమ్మ శోకదేవతలా ఉంది.

''ఇన్నాళ్ళు మన పెంపకం ఎందుకిలా తగులబడింది. ఎంత దేశభక్తి నూరిపోశాను వీడికి చిన్నప్పుడు. నాలుగేళ్ళు లండన్‌లో ఉండొచ్చి ఇండియా గురించి హీనంగా మాట్లాడ్తాడా! తల్లి చీరలో చిరుగులు చూసి నవ్వేవాడు కొడుకు కాదు. మాతృదేశంలో పేదరికం చూసి గేలి చేసే వాడు మనిషేకాదు. చేతనైతే తన దేశానికింత సాయం చెయ్యాలి. ప్రేమించిన పిల్లకి ద్రోహంచేసి, ఇచ్చిన మాట నిలుపుకోలేని వాడు వీడు నా కొడుకు కాదు. వీడిని రేపే ఇంట్లోంచి వెళ్ళగొడ్తాను. మళ్ళీ నా యింటి గడప తొక్కద్దంటాను'' ఆవేశంతో ఊగిపోయాడు గోపాల్రావు.

అంత శోకంలోనూ నిమ్మళంగా ప్రశాంతంగా అంది జానకమ్మ- ''కన్నతల్లిని, మాతృదేశాన్ని కించపరిచే సంస్కారం వాడిదైనా, అతిథిని దేవుడిలా గౌరవించే సంస్కృతి మనది, మన దేశానిది. వాణ్ణి మన దేశానికి అతిథిలా ఈ వారం రోజులూ గౌరవిద్దాం. ఆ తర్వాత మరెప్పుడూ రావొద్దనీ చెబ్దాం. అదే వాడికి శిక్ష. ఈ వారం నా కొడుకుని కళ్ళారా చూసుకుంటాను. తర్వాత వాడు ఇండియా వస్తాడనే ఆశ లేదు కూడా..'' ఆమె సంస్కారానికి విస్తుబోయాడు గోపాల్రావు.

★ ★ ★

రాత్రి పదయ్యింది.

మర్నాడు సంక్రాంతి.

అందమైన ముగ్గు వేయాలని వాకిలి శుభ్రంగా ఊడుస్తోంది అంకిత. పరికిణీ, ఓణిలో అచ్చ తెనుగు అందంలా ఉందామె.

''అక్కా! విన్నావా. బావ నిన్ను చేస్కోడట. లండన్ వెళ్ళి అక్కడమ్మాయిని చేస్కుంటాట్ట'' వగరుస్తూ చెప్పింది సుజీ. జానకమ్మగారి పనిపిల్ల కమ్ అంకిత గూఢచారి ఆమె. అత్తింట్లో విశేషాలు ఆమె ద్వారానే తెలుస్తాయి అంకితకి.

చేతిలో చీపురుకట్టని త్రిశూలంలా పట్టుకుని రుద్ర కాళికలా అత్తయ్య ఇంటికి బైలుదేరింది అంకిత. ''బావెక్కడ?'' అన్న గర్జనతో జానకమ్మ బిత్తరపోయి డాబావేపు చూపించింది.

బావ నైట్ డ్రెస్‌లో మోడరన్ మన్మథుడిలా డాబా మీద వెన్నెట్లో పక్క వేసుకుని పడుకున్నాడు.

నడుం మీద చీపురు దెబ్బ పడటంతో ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు.

''అంకితా! ఏంటిదీ'' అసలు దెబ్బలు తినే హీరో డూప్‌లా అరిచాడు.

''ఏమిటా! ఇన్నేళ్ళూ నాతో సరసాలాడి, నిన్ను కూడా ముద్దెట్టుకుని లండన్ పిల్లని పెళ్ళాడతావా!! అందుకే ఈ సన్మానం!'' కోపంగా అంటూ చీపురు తిరగేసింది. మంచం చుట్టూ తిరుగుతున్న బావని వదలకుండా వాయిస్తోంది.

పెద్దగా నవ్వుతూ దెబ్బలు తప్పించుకుంటున్నాడు శశి.

''ఆగవే రాక్షసీ. ఇలా కొట్టేవంటే రేప్పొద్దున్న నీకే పనికి రాకుండా పోతాను. నేను ఇండియా వచ్చేముందు మా అక్కతో చిన్న పందెం కాసాను. ఇండియా నచ్చలేదనీ, మరదల్ని చేస్కోననీ, లండన్‌లో సెటిలవుతాననీ అంటే నాన్న నన్ను ఇంట్లోంచి గెంటేస్తారని అక్కా, అమ్మ నన్ను కాపాడుతుందని నేనూ పందెం కాస్కున్నాం. చివరికి ఇద్దరం గెలిచాం... నా ముద్దుల మరదలా. లండన్ కాంట్రాక్టు అయిపోయింది. హైదరాబాద్‌లో జాబ్ చూసుకుని వచ్చేశాను. నీ ఇష్టం వచ్చిన ముహూర్తానికి నేను రెడీ'' అంటుండగా అక్క సెల్‌కి ఫోన్ చేసింది.

''అమ్మయ్య! కావాలంటే ఇదిగో అక్కతో మాట్లాడు!'' నవ్వుతూ సెల్‌ని అంకితకిచ్చాడు. భోపాల్ నుంచి మధుర. పందెం ప్రోగ్రెస్ గురించే ఫోన్ చేసింది.

''నేను చెప్పలేదుటోయ్ వాడు నా కొడుకనీ!'' అప్పుడే గొడవేంటో చూడ్డానికి డాబా పైకొచ్చిన గోపాలరావు అంటున్నాడు భార్యతో.

''బాగానే ఉందిరా భడవా! లండన్ వెళ్ళి మరింత అల్లరి నేర్చుకుని వచ్చావన్న మాట!'' కొడుకు చెవి మెలిపెడ్తూ తృప్తిగా నవ్వింది జానకమ్మ.

''నీ చీపురు వైద్యం బానే పనిచేసిందమ్మా!'' అని గోపాలరావు ఆట పట్టిస్తుంటే అంకిత ముఖంలో సిగ్గులు సంక్రాంతి ముగ్గుల్లా అనిపించాయి శశిధర్‌కి ఆ వెన్నెలరాత్రి.

☆



## వారసత్వం

**అక్కచెల్లెళ్ళ వారసత్వం మన సినీజగత్తులో కామన్ అయిపోయింది. అందాలతార సమీరారెడ్డి గ్లామర్ గురించి తెగ పట్టించుకుంటుంది. అలాగే ఎప్పుడూ హేపీగా కన్పించే సమీరా పార్టీలు, ఫంక్షన్లు అంటూ తెగ తిరుగుతుంది. ఈమధ్య తన బర్త్‌డేని కూడా చాలా గ్రాండ్‌గా చేసుకుంది. ఇదిలా ఉంటే ఈమె సోదరి సుష్మా రెడ్డికి ఈమెకి పూర్తిగా భిన్నంగా ప్రవర్తిస్తుంది. అక్కలాగే సినిమాల్లోకి రావాలని భావించిన సుష్మా అక్కకంటే అందంగా మారింది. అక్కకంటే ఘనత వహించిన నటిగా మారతానని ధీమా చెబుతుంటుంది సుష్మా. అంతకన్నా కావాల్సిందేం ఉంది?**